దేవాలయ భూములకు జియో ట్యాగ్

మంత్రి శ్రీధర్ బాబు

వేడుకల్లో పాల్గొని మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు

తుర్కయాంజాల్, జూలై 21 : రాష్ట్రంలోని దేవాలయ భూములు కబ్జా కాకూడదనే ప్రతిపాదనతో ప్రభుత్వం జియో ట్యాగ్ చేయబోతున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. శ్రీవైష్ణవ సేవా సంఘం తెలంగాణ రజతోత్సవాలను ఆదివారం మున్సిపాలిటీ పరిధి మన్నెగూడలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా వాటిని రక్షించాలనే ప్రతిపాదనతో ప్రభుత్వం దేవాలయ భూములకు జియో ట్యాగ్ చేయనున్నట్లు తెలిపారు. భూములు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దేవాలయ అర్చకులకు ఎలాంటి బదిలీలు ఉండవని స్పష్టం చేశారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణుల అభ్యున్నతికి పాటుపడుతామని తెలిపారు. అంతేకాకుండా ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. బ్రాహ్మణులకు తగిన ప్రాధాన్యతను కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి సభను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచార్యులు, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రమణాచారి, శ్రీ వైష్ణవ సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరువేంగళాచార్యులు, సేవాపతి మోహన్, అఖిల భారత బ్రాహ్మణ సమాఖ్య కార్యదర్శి తులసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ స్వామికి ఎమ్మెల్యే యాదయ్య పూజలు

షాబాద్, జూలై 21: ఘనగాపూర్ దత్తాత్రేయ స్వామిని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య దర్శించుకున్నారు. ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా కర్ణాటక రాష్ట్రంలోని ఘనగాపూర్‌లో స్వామివారి పల్లకీ సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే అనంతరం దత్తాత్రేయ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయన వెంట నియోజకవర్గ ప్రజలు తదితరులున్నారు.

రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి

షాబాద్, జూలై 21: గ్రామాల్లో అర్హులైన రైతులందరూ ప్రభుత్వం అందజేస్తున్న రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని షాబాద్ మండల వ్యవసాయాధికారి వెంకటేశం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త పట్టాదారు రైతులు, ఇప్పటివరకు కూడా రైతుబీమా చేసుకోని వారు బీమా కోసం జూన్ 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీమాలో మార్పులు, చేర్పుల కోసం జూలై 30వ తేదీ లోపు అవకాశముందన్నారు. కొత్తగా పాసుబుక్ వచ్చిన రైతులు పట్టాదారు పాస్‌బుక్, లేదా తహసీల్దార్‌తో డిజిటల్ సంతకం అయినా డీఎస్ పేపర్, రైతు ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు దరఖాస్తుకు జత చేయాలని పేర్కొన్నారు. 14 ఆగస్టు 1965 నుంచి 14 ఆగస్టు 2006 మధ్యలో పుట్టిన రైతులు మాత్రమే ఈ రైతు బీమాకు అర్హులని చెప్పారు. ఆగస్టు 5వ తేదీ లోపు చివరి గడువు ఉందని, అర్హులందరూ బీమాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఫొటో ఎక్స్‌పో ఎగ్జిబిషన్ విజయవంతం చేయాలి

మంచాల జూలై 21: ఈనెల 26, 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ కేబీఆర్ కన్వెన్షన్‌హాల్‌లో తెలంగాణ రాష్ట్ర ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరుగనున్న ఫొటో ట్రెడ్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా సంక్షేమ సంఘం కోశాధికారి ఏర్పుల మల్లేశ్ అన్నారు. ఆదివారం మంచాల ఫొటో గ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో మంచాలలో ఎగ్జిబిషన్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఫొటో గ్రాఫర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షురాలు అనిత, సంఘం నాయకులు శేఖర్‌గౌడ్, సతీశ్‌యాదవ్, శ్రీనివాస్, శేఖర్, జంగయ్య, భాస్కర్, మహేశ్, వంశీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

యాచారం, జూలై21: లారీని వెనకాల నుంచి ద్విచక్రవాహనం ఢీకొని ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని తమ్మలోనిగూడ గేటు వద్ద శనివారం రాత్రి జరిగింది. దీనికి సంబంధించి సీఐ శంకర్‌కుమార్ తెలిపిన కథనం ప్రకారం..మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన వరికుప్పల మల్లేష్ (40) తన కోడలు అనసూయతో కలిసి మాల్ వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా సరిగ్గా తమ్మలోనిగూడ గేటు వద్దకు రాగానే రోడ్డుపై లారీని నిలిపాడు. అది గమనించని మల్లేశ్ తన ద్విచక్ర వాహనం లారీని ఢీకొట్టాడు. ప్రమాదంలో మల్లేశ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. అతడి కోడలు అనసూయ తీవ్రంగా గాయపడింది. వారిని చికిత్స నిమిత్తం మాల్‌లోని ఓ దవాఖానకు తరలించారు. అప్పటికే మల్లేశ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనసూయకు మెరుగైన వైద్యం అందించేందుకు నగరంలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షాద్‌నగర్ టౌన్ : దేవాలయ ప్రాంగణంలో మహిళకు చీరను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



కడ్తాల్ : మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో..



షాద్‌నగర్ టౌన్ : సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

ఆలయాల్లో పూజలు చేసిన ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌టౌన్, జూలై 21: గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని షాద్‌నగర్ మున్సిపాలిటీలోని శ్రీ సాయిబాబా దేవాలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను శ్రీ శేషసాయి సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి హారతి, అభిషేకం, ధూపహారతి, పల్లకి సేవ వంటి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, కౌన్సిలర్లు వెంకట్రాంరెడ్డి, కొందూటి మహేశ్వరి, లతాశ్రీ, పలువురు నాయకులు పూజలు చేశారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్‌ను ట్రస్ట్ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీ శేషసాయి సేవా సమితి ట్రస్ట్ సభ్యులు విజయ్‌కుమార్, సుధాకర్, చంద్రశేఖర్‌రెడ్డి, జంగయ్యగౌడ్, క్రాంతి కుమార్, విజయ్‌మోహన్‌రెడ్డి, సంతోశ్‌కుమార్, అర్చకులు లక్ష్మణ చార్యులు, లింగం, నాయకులు శ్రీశైలం, విజయ్‌కుమార్, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్, అశోక్, వెంకటేశ్, మోహన్ పాల్గొన్నారు.

కొంగరకలాన్‌లో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డికిషన్‌రెడ్డి పూజలు

ఆదిబట్ల : ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి కొంగరకలాన్‌లోని సాయిబాబా ఆలయంలో ఆదివారం ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పూజలు చేశారు. ఆయన వెంట ఆలయ చైర్మన్ కల్వకోలు రవీందర్‌రెడ్డి, మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు జంగయ్య, కౌన్సిలర్లు శ్రీను, మహేందర్, బీఆర్ఎస్ నాయకులు జంగయ్య, బబ్లూ పాల్గొన్నారు.

చేవెళ్లటౌన్: షిర్డీ సాయి బాబాను దర్శించుకుంటున్న భక్తులు

ఆమనగల్లు సాయిబాబా ఆలయంలో కోలాటం వేస్తున్న చిన్నారులు, భక్తులు

కడ్తాల్ : మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురు పౌర్ణమి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ ప్రధాన అర్చకులు ఎల్లికంటి వెంకటేశ్వరశర్మ, జ్ఞానప్రసూన శర్మ దంపతులు, నర్సింహామూర్తి ఆధ్వర్యంలో షిర్డీ సాయిబాబాకు అభిషేకం, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేసి, సామూహిక సాయి వ్రతాలు, హారతి ఇచ్చారు. ఉత్సవాల్లో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్ఎన్ రెడ్డి, నాయకులు చెన్నకిషన్‌రెడ్డి, మల్లప్ప, భాస్కర్‌రెడ్డి, మల్లారెడ్డి, రాములుయాదవ్, బాల్‌రెడ్డి, భద్రప్ప, రాఘవ చారి, మల్లేశ్, నారాయణ, ప్రభులింగం, కరుణాకార్, భరత్, మహేశ్, స్త్రీ శక్తి లలితా సహస్రనామ బృందం మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

నందిగామ : నందిగామ, చేగూరు, హెచ్‌బీఎల్ పరిశ్రమలోని శ్రీ సాయిబాబా దేవాలయాల్లో భక్తులు పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

ఆకట్టుకున్న కోలాటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు

ఆమనగల్లు : ఆమనగల్లు మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయంలో ఉదయం సుప్రభాతం, హారతి, శ్రీసాయినాథుడి మంగళస్నానం, సంస్థాన్‌వారి హారతి, అర్చనలు చేశారు. అనంతరం సామూహిక వ్రతాలు, పల్లకి సేవ నిర్వహించారు. చిన్నారుల, భక్తుల కోలాటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు రాము, కౌన్సిలర్ లక్ష్మణ్, వెంకటేశ్, ఆంజనేయులు, నయనాచారి, శ్యామ్, అర్చకులు మధుసూదన్‌శర్మ, రవికిరణ్, కార్తిక్, కుమార్, కౌశిక్ ఉన్నారు.

షాద్‌నగర్‌లో.. పత్యేక అలంకరణలో సాయిబాబా

అన్నదానం..

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లోని సాయిబాబా ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని ఖానాపూర్‌లోని సాయిబాబా ఆలయంలో బీఆర్ఎస్ మున్సిపల్ కార్యదర్శి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక అన్నదానం చేశారు.

చేవెళ్ల టౌన్ : చేవెళ్ల మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. అదేవిధంగా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పలు కాలనీల్లో స్వామి వారి విగ్రహ ఊరేగింపు నిర్వహించారు.

కొంగరకలాన్‌లో సాయిబాబా మందిరంలో పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు

షాద్‌నగర్‌టౌన్ : పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పెద్దఅంబర్‌పేట : పెద్దఅంబర్‌పేటతోపాటు తట్టిఅన్నారం జీవీఆర్ కాలనీలోని సాయిబాబా ఆలయంలో భక్తులు పూజలు చేశారు. జీవీఆర్ కాలనీలోని శ్రీసాయి నీలకంఠేశ్వర స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, భక్తులకు నర్సింహారెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ రాజనర్సు, వైస్ చైర్మన్ పీవీ రత్నం, సెక్రటరీ కేఎస్ రామారావు, ట్రెజరర్ సీహెచ్ వేణుగోపాల్, జాయింట్ సెక్రటరీ ఆర్ఈ వేణుగోపాల్, లీగల్ సెక్రటరీ కే విశ్వనాథ్, సభ్యులు ఎన్‌వీ ఉన్నితన్, జయరామ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, శేఖర్, పెద్దిరాజు, పాండురంగారావు, నాగప్ప, రాములు, గోపాల్, శశిధర్, కేశవరావు, శంకర్, రాము పాల్గొన్నారు.

చేవెళ్ల రూరల్ : శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి సాయి కాలనీలోని సాయిబాబా ఆలయంలో భక్తులు పూజలు చేశారు. శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి ప్రవీణ్‌కుమార్, వైస్ చైర్మన్ వెంకట్ రామ్‌రెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు.

తట్టిఅన్నారం జీవీఆర్ కాలనీలోని సాయి బాబా ఆలయంలో..

ఎడతెరిపిలేని వాన..

చేవెళ్లటౌన్, జూలై 21: చేవెళ్లలో మూడు నాలుగు రోజుల నుంచి చిరుజల్లులతో కూడిన వర్షం కురుస్తుండగా, పంటలకు ప్రాణం పోసినట్లుగా అయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బావులు, బోర్లు, చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

జోరుగా వరినాట్లు..

ఇబ్రహీంపట్నంరూరల్, జూలై 21 : మూడు రోజులుగా ఎడతెరిపిలేని వానలు కురుస్తుండటంతో రైతులు పొలంబాట పట్టారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో నిన్నమొన్నటి వరకు వర్షాలు లేక ఎదురుచూసిన రైతులకు ఒక్కసారిగా వరుణదేవుడు కరుణించి ఎడతెరిపిలేకుండా వానలు కురుస్తుండడంతో వ్యవసాయ పొలాల్లో వరినాట్లు వేసేందుకోసం రైతులు పొలంబాట పట్టారు. దీంతో వ్యవసాయ పొలాల్లో సందడి కనిపించింది.

ఏదీ.. లాస్ట్ మైల్ కనెక్టివిటీ

మెట్రో స్టేషన్‌లతో అనుసంధానం కాని ప్రజా రవాణా వ్యవస్థలు

మెట్రో కారిడార్-3లోని నాగోల్‌లో వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన స్థలం

సిటీబ్యూరో, జూలై 21 (నమస్తే తెలంగాణ): లాస్ట్ మైల్ కనెక్టివిటీ హైదరాబాద్ మెట్రో రైలు వ్యవస్థలో అత్యంత కీలకమైంది. నగరంలో మెట్రో సేవలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రజా రవాణా వ్యవస్థలోనే అత్యంత వేగంగా ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. అలాంటి మెట్రో రైలు నెట్ వర్క్‌లో లాస్ట్ మైల్ కనెక్టివిటీ అన్న అంశం ప్రచారానికే పరిమితమైంది. మెట్రో సేవలు ప్రారంభమై 6 సంవత్సరాలు గడుస్తున్నా.. ఇప్పటికీ లాస్ట్ మైల్ కనెక్టివిటీ అనేది ఆమడ దూరంలోనే ఉంది. మెట్రోలో ప్రయాణం చేసే వారంతా తమ ఇంటి నుంచి సొంత వాహనాలపైనే మెట్రో స్టేషన్‌లకు చేరుకొని అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా మెట్రో కారిడార్-3లో ప్రారంభ మెట్రో స్టేషన్ అయిన నాగోల్‌లో వాహనాల 3-4 ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఐటీ కారిడార్‌ను అనుసంధానం చేసే ఈ మెట్రో మార్గంలోనే ప్రయాణికులు గణనీయంగా పెరగడంతో సొంత వాహనాలు సైతం ఆదే స్థాయిలో పెరిగాయి.దీంతో మెట్రో అధికారులు అదనంగా మరిన్ని వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు వీలుగా పార్కింగ్ స్థలాన్ని ఉప్పల్ మెట్రో డిపో, కమాండ్ కంట్రోల్ సెంటర్ పక్కన ఏర్పాటు చేశారు. ఒకేసారి అన్ని రకాల వాహనాలు కలిపి 600లకు పైగా వాహనాలను పార్కింగ్ చేసుకునే అవకాశం ఇక్కడ ఉంది. ఇలా ఒక్క నాగోల్ మెట్రో స్టేషన్‌లోనే కాదు.. ప్రారంభ మెట్రో స్టేషన్లు, మధ్యలో ఉండే ఇంటర్ చేంజ్ స్టేషన్‌లలో, ఇతర మెట్రో స్టేషన్‌లలోనూ పార్కింగ్ సౌకర్యాలను కల్పిస్తున్నారే తప్ప.. ఆయా మెట్రో స్టేషన్‌లతో ప్రజా రవాణా వ్యవస్థలైన ఆర్టీసీ, ఎంఎంటీఎస్,సెట్విన్,ఆటో రిక్షాలను మాత్రం అనుసంధానం చేయడం లేదు. మరోవైపు నిత్యం 5లక్షలకు పైగా ప్రయాణికులు మెట్రోలోనే ప్రయాణం చేస్తున్నారు. అయినా లాస్ట్ మైల్ కనెక్టివిటీ విషయంలో మెట్రో అధికారులు మాత్రం మొక్కుబడి చర్యలతో సరిపెడుతున్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు

పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

మొదల్లగూడలో బోనాల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

నందిగామ, జూలై21: మండలంలోని మొదళ్లగూడ గ్రామంలో ఆదివారం జరిగిన పోచమ్మ, మైసమ్మ బోనాల ఊరేగింపులో ఉమ్మడి మహబుబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొని ఆలయాల్లో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. అమ్మవార్ల దీవెనలతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. నర్సప్పగూడ గ్రామంలో మహంకాళీ బోనాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు.

శంకర్‌పల్లిలో బోనాలు

చేవెళ్ల రూరల్ : శంకర్‌పల్లిలో ఆదివారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా 14వ వార్డు కౌన్సిలర్ శ్వేతా పాండురంగారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి బోనాలతో అమ్మవారి దేవాలయానికి వెళ్లి బోనం సమర్పించారు. అనంతరం నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించారు.

కుటుంబ సభ్యులతో బోనమెత్తిన కౌన్సిలర్ శ్వేతాపాండురంగారెడ్డి

శంకర్‌పల్లి కట్టమైసమ్మ వద్దకు బోనాలతో వెళ్తున్న మహిళలు

విద్యుదాఘాతంతో కిరాణ షాపు దగ్ధం

చేవెళ్ల రూరల్, జూలై 21 : విద్యుదాఘాతంతో కిరాణం షాపు దగ్ధమైన ఘటన శంకర్‌పల్లి మండల పరిధిలోని అంతప్పగూడలో జరిగింది. బాధితుడు వెంకటేశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శేరిగూడ గ్రామానికి చెందిన వెంకటేశ్ గౌడ్ కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కిరాణ షాపు పూర్తిగా దగ్ధమైంది. ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదని, రూ.లక్ష వరకు వస్తువులకు సంబంధించిన నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

గంజాయి రవాణా.. ఇద్దరు అరెస్ట్

చేవెళ్ల రూరల్, జూలై 21 : గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసిన ఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సంతోశ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బీడీఎల్ ఎక్స్ రోడ్డు వద్ద ఇద్దరు వ్యక్తుల బ్యాగుల్లో 5.5 కేజీల గంజాయి ఉందన్న విశ్వసనీయ సమాచారంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. ఆదివారం ఒడిస్సా రాష్ట్రానికి చెందిన మాణిక్య మజ్జీ వద్ద తక్కువ ధరకు గంజాయి తీసుకొచ్చి శంకర్‌పల్లిలోని అరుణ్ అనే వ్యక్తికి అధిక ధరలకు విక్రయించడానికి ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 5.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు భీమల్‌నాయక్ (26), ఉమేశ్ మజ్జీ (28)పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

కడ్తాల్, జూలై 21: మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాకు చెందిన సభావట్ పీక్లీనాయక్ మరణించగా, విషయం తెలుసుకున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి భీక్యానాయక్ ఆదివారం స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.4వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాములునాయక్, కాంగ్రెస్ పార్టీ బ్లాక్, మండల శాఖల అధ్యక్షుడు నర్సింహ, బీచ్చానాయక్, నాయకులు హీరాసింగ్, తులసీరాంనాయక్, చత్రునాయక్, శంకర్, వెంకట్, రమేశ్, నిరంజన్, సికిందర్, వినోద్, మల్లేశ్, హర్యా, జైపాల్ పాల్గొన్నారు.